

అపురూపమమ్మ

సిరుల తల్లీ రావమ్మా.. శుభములొసగు మాయమ్మ అంటూ ఆ దుర్గాదేవిని భక్తజనం కొలిచింది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శరన్నవ రాత్ర ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది.


8లో



చాకులతో నలుగురిపై దాడి

బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి దారి ఇవ్వలేదన్న కోపంతో చాకులతో నలుగురిపై దాడికి పాల్పడిన ఘటన నిడదవోలు పట్టణ శివారు లింగంపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది.

2.28 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 2,28,353 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 12,700 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

ప్రారంభమైన టెట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కాకినాడ జిల్లాలో గురువారం ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేయగా తొలిరోజు రెండు కేంద్రాల్లో మాత్రమే పరీక్ష నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు అచ్యుతాపురం అయాన్ కేంద్రంలో 459 మంది హాజరుకాగా 61మంది గైర్హాజరయ్యారు. రాయుడుపాలెం సాఫ్ట్ టెక్నాలజీ కేంద్రంలో 128మంది హాజరు కాగా 19మంది పరీక్ష రాయలేదు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు అచ్యుతాపురం అయాన్ కేంద్రంలో 469 మంది హాజరుకాగా 51మంది గైర్హాజరయ్యారు. సాఫ్ట్ టెక్నాలజీ కేంద్రంలో 133 మంది హాజరుకాగా 13మంది గైర్హాజరయ్యారు.

డ్వామా పీడీగా మహేశ్వరరావు



రాజమహేంద్రవరం రూరల్: జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎ.నాగమహేశ్వరరావు గురువారం సాయంత్రం బొమ్మూరులోని డ్వామా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణా జిల్లా డ్వామా కార్యాలయంలో ఏపీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ

జిల్లా సహకార అధికారి శ్రీరాములు నాయుడు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కాగా.. డ్వామా పీడీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మహేశ్వరరావు.. కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మద్యం దుకాణాలకు పది దరఖాస్తులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో మద్యం దుకాణాలకు సంబంధించి గురువారం పది దరఖాస్తులు వచ్చినట్టు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య తెలిపారు. మొత్తం 125 మద్యం దుకాణాల కోసం ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు రాజమహేంద్రవరం నార్త్, రాజమహేంద్రవరం సౌత్, కోరుకొండ, రంగంపేట, కొవ్వూరు, దేవరపల్లి, నిడదవోలులోని ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలపై మార్గదర్శకాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): పట్టా భూముల్లో ఇసుకను తవ్వడానికి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పట్టా భూముల నుంచి ఇసుకను తీయడం, ప్రభుత్వం ఇచ్చిన భూములలో వ్యవసాయం చేయకుండా ఇసుకను తొలగించడానికి మార్గదర్శకాలతో జీఓ జారీ అయిందన్నారు. పట్టాదార్ పాస్‌బుక్, టైటిల్ డీడ్ పుస్తకం, గ్రామ మ్యాప్‌లో ఉన్న భూమి నకలుతో పాటు కలెక్టర్‌కు దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. క్షేత్ర స్థాయిలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ పట్టా భూమి తనిఖీ చేపట్టాలన్నారు. కమిటీలోని గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ, మైన్స్ అధికారులతో పాటు సంబంధిత డివిజన్ పరిధిలో ఆర్డీవో, డీఎస్పీలు తనిఖీ సమయంలో హాజరవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లా పంచాయతీ అధికారులతో పాటు ప్రాంతాన్ని గుర్తించి, క్షేత్ర స్థాయిలో సరిహద్దుల నిర్ధారణ చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన రత్నగిరి

అన్నవరం: దసరా వేడుకల తొలి రోజు గురువారం రత్నగిరి సత్యదేవుని ఆలయం భక్తులతో కిటకిట లాడింది. విద్యాసంస్థలకు దసరా సెలవులు ప్రారంభమవడంతో పెద్ద సంఖ్యలో భక్తులు సత్యదేవుని ఆలయానికి విచ్చేశారు. దూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చి వ్రతాలాచరించారు.

తమ్ముళ్లకు దసరా!



- మద్యం కిక్కు కోసం తహతహ
- షాపు ఎవరికి దక్కినా తమదే పెత్తనమంటూ కూటమి నేతల ధీమా
- సిండికేట్‌గా మారుతున్న వ్యాపారులు
- ఏ షాపు ఎవరికి కావాలో ముందుగానే పంపకాలు
- అధిక ఆదాయం వచ్చే వాటిపై గురి
- జిల్లాలో 125 షాపులకు దరఖాస్తులు
- రెండు రోజులైనా ఒక్క దరఖాస్తూ నమోదుకాని వైనం
- సుముహూర్తం, మంచి ఘడియల కోసం ఎదురుచూపులు
- దరఖాస్తు విధానం సులభతరం చేసిన అధికారులు

సాక్షి, రాజమహేంద్రవరం: మద్యం కిక్కు కోసం తెలుగు తమ్ముళ్లు, కూటమి నేతలు తహతహలాడుతున్నారు. షాపులు ఎలాగైనా దక్కించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. ఎవరు దరఖాస్తు చేసినా.. చివరకు తమకే దుకాణం దక్కేలా ఎత్తులు వేస్తున్నారు. దరఖాస్తుల ప్రక్రియ నుంచే సిండికేట్ అవతారం ఎత్తుతున్నారు. దరఖాస్తు దారులను బెదిరించేందుకు అన్ని అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. నయానో భయానో షాపులు కైవసం చేసుకుని రూ.కోట్లు దోచుకునేందుకు పావులు కదుపుతున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు తమ అనుచరులకు డబ్బిచ్చి మరీ పంపుతున్నారు. లాటరీలో షాపు ఎవరికి కేటాయించినా అంతిమంగా తమ్ముళ్లు, కూటమి నేతలు లబ్ధి పొందేలా వ్యూహరచన చేస్తున్నారు. ఇందుకుగాను సిఫారసుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు పరుగులు తీస్తున్నారు.

జిల్లాలో 125 షాపులు

ఏ ప్రభుత్వమైనా విజయ దశమికి ప్రజా ప్రయోజన పథకానికి నాంది పలుకుతుంది. కానీ కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చేలా చేస్తోంది. తద్వారా తాగినోళ్లకు తాగినంత మద్యం అందించి వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగానే నూతన మద్యం పాలసీకి నాంది పలికింది. ప్రభుత్వం నుంచి ప్రైవేటుకు కట్టబెడుతూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 12వ తేదీ నుంచి మద్యం దుకాణాలు తెరచుకోనున్నాయి. తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 125 ప్రైవేటు మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. 11న రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో కలెక్టర్ సమక్షంలో ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీస్తారు. 12న విజయదశమి రోజు నుంచి దుకాణాల్లో మద్యం అమ్మకాలు సాగనున్నాయి. రాజమహేంద్రవరం అర్బన్‌లో 28, రూరల్ 11, మిగిలిన మండలాల్లో 90 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చారు. లైసెన్సు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ధారించారు. వేలంలో షాపు దక్కకపోతే ఆ డబ్బు వెనక్కు ఇవ్వరు.

సిండికేట్ అవతారం ఎత్తిన తమ్ముళ్లు

మద్యం పాలసీ ప్రకటించిన వెంటనే తమ్ముళ్లు సిండికేట్ అవతారం ఎత్తారు. షాపు ఎవరికి దక్కినా పెత్తనం మాత్రం తమదేనంటూ బహిరంగ ప్రకటనలకు దిగుతున్నారు. అధికారం అడ్డం పెట్టుకుని ప్రభుత్వ నిబంధనలను సైతం తుంగలో తొక్కేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. దీనికితోడు ప్రభుత్వం సైతం కూటమి నేతలు, కార్యకర్తలకు మేలు జరిగే విధంగా సంస్కరణలు తీసుకురావడంతో దోపిడీకి సిద్ధమవుతున్నారు. చీప్ లిక్కర్ క్వార్టర్ (180 ఎంఎల్) రూ.99 కే విక్రయిస్తామని ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించింది. మిగిలిన బ్రాండ్లన్నీ ఎమ్మార్పీకే విక్రయించాలి. కానీ ధర పెంచి విక్రయించుకునేందుకు ప్రభుత్వం నుంచి అనధికారిక ఆదేశాలు అందినట్టు వినికిడి. మద్యం వ్యాపారం ద్వారా టీడీపీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలు సిండికేట్‌గా ఏర్పడి దుకాణాలు దక్కించుకునేలా ఆదేశించింది. బీజేపీ, జనసేన నేతల నుంచి ఇబ్బందులు, ఆందోళనలు చోటు చేసుకోకుండా వాళ్లను సైతం కలుపుకొని వెళ్లాలని సూచించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇతరులు దరఖాస్తు చేయకుండా ముందుగానే అడ్డుకోవాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. అందుకు ఎక్సైజ్ అధికారులతో టీడీపీ నేతలు టచ్‌లో ఉండి.. ఎవరు దరఖాస్తు చేస్తున్నారు? వాళ్ల పరిస్థితేంటన్న విషయమై ఆరా తీయాలని ఆదేశించినట్టు సమాచారం. అధికారులు పూర్తిగా టీడీపీ నేతలకే సహకరిస్తారన్న సూచనలు ప్రభుత్వ పెద్దల నుంచి రావడంతో టీడీపీ నేతలు మరింతగా రెచ్చిపోతున్నారు.

అధిక విక్రయాలకు గ్రీన్ సిగ్నల్?

మద్యం విక్రయాల్లో అక్రమాలకు తెర తీసే ఆస్కారాన్ని కల్పిస్తూ ప్రభుత్వం కొన్ని మినహాయింపులు ఇస్తోంది. మద్యం ధర ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించుకుని దోచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తోంది. ఒక్కో బాటిల్ నుంచి బ్రాండ్‌ను బట్టి రూ.20 నుంచి రూ.30 అదనంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తోంది. దీనికి కూటమి పెద్దల నుంచి సానుకూలత వ్యక్తం అవడంతో దోపిడీకి దారులు తెరుస్తున్నారు. సందట్లో సడేమియా అన్న చందంగా ఎక్సైజ్ అధికారులు సైతం చూసీ చూడనట్టు ఉండి మామూళ్లు దండుకొనేందుకు సిద్ధమవుతున్నారు.

గీత కార్మికులకు నిరాశే

కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు విషయమై కూటమి ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరించింది. ఈ నోటిఫికేషన్‌లో మొండి చేయి చూపారు. మద్యం షాపుల్లో 10 శాతం కేటాయించాల్సి ఉండగా.. మరో నోటిఫికేషన్‌లో కేటాయిస్తామని చేతులు దులుపుకున్నారు. తర్వాత కేటాయిస్తారా? లేదా? అన్న మీమాంస కార్మికుల్లో నెలకొంది.

జిల్లాలో మద్యం షాపులు ఇలా...

మండలం	షాపులు
రాజమహేంద్రవరం అర్బన్	28
రాజమహేంద్రవరం రూరల్	11
అనపర్తి	6
బిక్కవోలు	5
చాగల్లు	4
దేవరపల్లి	5
గోకవరం	5
గోపాలపురం	3
కడియం	6
కోరుకొండ	4
కొవ్వూరు అర్బన్	3
కొవ్వూరు రూరల్	5
నల్లజర్ల	6
నిడదవోలు రూరల్	5
నిడదవోలు అర్బన్	4
పెరవలి	5
రాజానగరం	7
రంగంపేట	2
సీతానగరం	2
తాళ్లపూడి	4
ఉండ్రాజవరం	5

దరఖాస్తులు నిల్

మద్యం పాలసీ ప్రకటించిన అనంతరం తొలి రోజు అమావాస్య కావడంతో ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. రెండో రోజైన గురువారం దరఖాస్తులు తీసుకుని వెళ్లిన వ్యాపారులు శుక్రవారం నుంచి దరఖాస్తులు చేసుకునే వీలుంది. మంచి రోజు, సుముహూర్తం, మంచి ఘడియల్లో దరఖాస్తు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలన్న విషయమై స్పష్టత లేకపోవడంతో కొంత మంది ఇబ్బంది పడుతున్నారు.



వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీలను గురువారం లెక్కించగా, రూ.1,08,89,635 ఆదాయం వచ్చిందని దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం చక్రధరరావు తెలిపారు. 35 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.90,26,494, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.18,63,141 వచ్చిందన్నారు. అలాగే విదేశీ కరెన్సీ కూడా సమకూరిందన్నారు. బంగారం 19 గ్రాములు, వెండి 735 వచ్చిందని వివరించారు. శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి హుండీలను లెక్కించగా, రూ.2,36,510 ఆదాయం సమకూరిందన్నారు. రాజమహేంద్రవరం తనిఖీ అధికారి టీవీఎస్ ప్రసాద్, రాజోలు గ్రూప్ టెంపుల్స్ ఈఓ ఎన్‌వీఎస్‌ఎస్‌పీ ప్రసాద్‌రాజు పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్సై రాము పోలీసు బందోబస్తు నిర్వహించారు.

‘బంగారుకొండ’కు సీఎస్‌ఆర్ నిధులు

గెయిల్ ప్రతినిధులతో కలెక్టర్ ప్రశాంతి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): పిల్లల ఎదుగుదలను సాధారణ స్థితికి తీసుకుని వచ్చే క్రమంలో జిల్లాలో బంగారు కొండ ప్లస్ కార్యక్రమాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద చేపట్టే ప్రతిపాదనలను సిద్ధం చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గెయిల్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయసుకు తగ్గ బరువు, ఎదుగుదల లేని, రక్తహీనత, తీవ్ర పోషకాహార లోపం గల పిల్లలను గుర్తించి వారిని సాధారణ స్థితికి తీసుకురావడం కోసం బంగారు కొండ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా చేపట్టామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో ప్రయోగాత్మకంగా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసే విధానంలో పోషికాహార లోపం లేకుండా చూడడంతో, అంగన్వాడీ కేంద్రాల్లో బోధన సంబంధ అంశాలను జోడించి ‘ బంగారు కొండ ప్లస్’ కార్యక్రమాన్ని ఈ ఏడాది చేపట్టనున్నట్లు కలెక్టరు ప్రశాంతి తెలిపారు. గత ఏడాది చేపట్టిన బంగారు కొండ కింద 1,283 మందికి బంగారుకొండ కిట్స్ అందించి 1,169 మందిని సాధారణ స్థితికి తీసుకువచ్చామని తెలియజేశారు. నూటికి నూరు శాతం ఫలితాలు సాధించడం లక్ష్యంగా చేసుకుని అడుగులు వేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 469 మంది చిన్నారులు ఈ కేటగిరిలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇతర కార్పొరేట్ సంస్థల సహకారంతో కౌమార దశలో ఉన్న బాలికలకు ‘మునగపొడి ‘ అందించి రక్తహీనతను అధిగమించి అనీమియా లేకుండా పరిరక్షణ బాధ్యతలు నిర్వహించినట్లు తెలియచేశారు. గెయిల్ ఆధ్వర్యంలో ‘బంగారు కొండ ప్లస్’ కార్యక్రమానికి సహకారం అందించాలని కోరారు. పిల్లలకి ప్రభుత్వం అందించే సంపూర్ణ పోషణకి అదనంగా బంగారుకొండ కిట్లను అందించి, ప్రతివారం వారీ ఆరోగ్య వివరాలు, ఎదుగుదల విధానం పరిశీలిస్తామని తెలిపారు. గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ (ఓఎం)కేవీఎస్ రావు మాట్లడుతూ, జిల్లా యంత్రాంగం తరపున అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, పోషకాహారలోపం నిర్మూలన, సంక్షేమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం తదితర కార్యక్రమాలను అమలు చేసేందుకు సహాయ సహకారాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గెయిల్ మేనేజర్ (హెచ్‌ఆర్) ప్రభాకర్, ఐసీడీఎస్ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి, ఇండస్ట్రీస్ అధికారి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా శివప్రసాద్



రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్(ఎన్‌ఫోర్స్‌మెంట్)గా టి.శివప్రసాద్ గురువారం బొమ్మూరు వైటీసీలో ఈఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా ఏపీబేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఐఎంఎల్ డిపోల జోనల్ మేనేజర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఏసీగా బాధ్యతలు స్వీకరించిన శివప్రసాద్‌ను ఎక్సైజ్‌సూపరింటెండెంట్ లావణ్య, ఏఈఎస్(ఎన్‌ఫోర్స్‌మెంట్) వినీషా, ఇన్‌స్పెక్టర్లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఏఈఎస్‌గా నాగ రాహుల్

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నాగ రాహుల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏఎస్‌ఆర్ జిల్లా పాడేరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన నాగరాహుల్ ఈఎస్ లావణ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా మహాశక్తి యాగం

- రమణయ్యపేట శ్రీపీఠంలో దసరా సందడి ఆరంభం
- తొలి రోజు దీక్ష వస్త్రాలతో కుంకుమార్చనలో 26 వేల మంది మహిళలు



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న పరిపూర్ణానంద స్వామీజీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీపీఠంలో మహాశక్తి యాగం ఘనంగా సాగింది. పీఠంలో దసరా పూజా కార్యక్రమాలను గురువారం పరిపూర్ణానంద స్వామి ప్రారంభించారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతి రోజూ ఇక్కడ భారీ ఎత్తున కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. తొలి రోజే సుమారు 26వేల మంది మహిళలు దీక్షా వస్త్రాలు ధరించి పూజకు హాజరయ్యారు. తొమ్మిది గంటల నుంచి భక్తుల సందడి ప్రారంభయ్యింది. లలితా సహస్ర నామాలతో కుంకుమార్చనలు నిర్వహించేందుకు మహిళాభక్తులకు రెండు భారీ షెడ్లను ఏర్పాటు చేయడంతో వాటిలో కూర్చున్నారు. తొలుత స్వామిజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ నెల 13వరకు శ్రీపీఠంలో దసరా పూజా కార్యక్రమాలు జరుగుతాయని, వేలాదిగా వచ్చే భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశామన్నారు. మూలా నక్షత్రం రోజు విద్యార్థులకు సరస్వతీ పూజ, అష్టమి నాడు అమ్మవారికి వేలాది మంది భక్తులతో కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. లలితా అమ్మవారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని దేశం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ పూజలు నిర్వహిస్తున్నామన్నారు. పది రోజుల పాటు వంద కోట్ల కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. తొలి రోజు సాయంత్రం అన్నపూర్ణ దేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అన్న సూక్త, అన్నపూర్ణ హోమాలను వేద పండితులు నిర్వహించారు.



దీక్షా వస్త్రాలు ధరించి శ్రీపీఠంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

పండగ పూటా పస్తులేనా?



జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

- సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆవేదన
- రెండు నెలలుగా అందని జీతాలు
- జిల్లాలో 417 మంది ఉద్యోగులు
- విద్యాశాఖ కార్యక్రమాల్లో వీరే కీలకం

రాజమహేంద్రవరం రూరల్: విద్యాశాఖ కార్యక్రమాల అమల్లో సమగ్రశిక్ష ఉద్యోగులదే కీలకపాత్ర. అలాంటిది వీరికి సకాలంలో వేతనాలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100రోజులు గడుస్తున్నా..తమ సమస్యలు వినకపోగా, కనీసం వేతనాలు కూడా సకాలంలో చెల్లించడం లేదు. ఆగస్టు, సెప్టెంబర్ వేతనాలపై నేటికీ స్పష్టత ఇవ్వకపోగా.. జీతాలకు నిధులు లేవని రెండురోజుల కిందట ఉన్నతాధికారులు చెప్పడంతో వీరంతా అసంతృప్తి చెందారు. ఈ దసరా పండక్కి తమ కుటుంబాలు అర్ధాకలితో అలమటించక తప్పదా? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలకులు కరుణించి కనీసం పెండింగ్ జీతాలైనా దసరా ముందు చెల్లించేటట్టు చూడాలని కోరుతున్నారు.

చిరుద్యోగులపై శీతకన్ను

సమగ్రశిక్ష ఆధ్వర్యంలో సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, అకౌంటెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్‌టీలు, పార్ట్‌టైమ్ టీచర్లు, ఆయాలు కలిపి జిల్లావ్యాప్తంగా 417మంది పనిచేస్తున్నారు. వీరిని కాంట్రాక్టు ప్రాతిపదికన ఏటా కొనసాగిస్తున్నారు. డిగ్రీ, బీఈడీ వంటి ఉన్నత అర్హతలతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు 22 రోజులపాటు సమ్మె చేయగా..నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీరి సమస్యలకు పరిష్కారం చూపేలా కమిటీ ఏర్పాటు చేసింది. నాటి విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు దఫాలుగా చర్చించిన కమిటీ ఉద్యోగ భద్రతకు స్పష్టమైన హామీ ఇచ్చింది. ఈలోగానే ప్రభుత్వం మారడంతో వీరి సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లైంది. కూటమి ప్రభుత్వం సమగ్రశిక్షలోని చిరుద్యోగుల సమస్యలపై ఏమాత్రం దృష్టి సారించకపోవడంతో వీరంతా మథనపడుతున్నారు.

పని ఒత్తిడితో సతమతం

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు సకాలంలో రాకపోగా..విధుల నిర్వహణలో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవుపై వెళితే..అలాంటి చోట్ల కాంప్లెక్స్ సీఆర్పీలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. కమిషనరేట్‌కు జరిగే ఉత్తర, ప్రత్యుత్తరాలకు సంబంధించి సమయపాలన లేకుండా విధులు నిర్వహించాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా ఉద్యోగులకు సైతం రాత్రి 9.00 గంటల వరకు ఎంఆర్‌సీల్లో పని చేయిస్తుండటంపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నా..వీరి గోడు పట్టించుకునే వారే కరవయ్యారు.

ఫ్రెండ్లీ ప్రభుత్వం ఎక్కడ..

అధికారంలోకి వస్తే ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉంటుందని కూటమి నేతలు చెప్పిన మాటలు ...ఇప్పుడు ఆచరణలో కనిపించడం లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులు ఇస్తున్నప్పటికీ.. బడ్జెట్ లేదని ఉన్నతాధికారులు చెబుతుండడంపై మండిపడుతున్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించడంతో పాటు, తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం మరోమారు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే గాంధీజయంతి రోజున మహాత్ముడి విగ్రహం వద్ద శాంతియుత నిరసనలు తెలిపి..వినతిపత్రాలు సమర్పించినట్టు ఉద్యోగులు చెబుతున్నారు.

క్లుప్తంగా

డీజిల్ తరలిస్తున్న వ్యాన్ సీజ్


సీజ్ చేసిన వ్యాన్ వద్ద అధికారులు, కోరంగి పోలీసులు

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వ్యాన్‌ను కోరంగి పోలీసులు గురువారం సీజ్ చేశారు. ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. ముందుగా అందిన సమాచారం మేరకు ఎంఎస్‌ఓ లక్ష్మీ ప్రసన్న వీఆర్వోలతో కలిసి కోరంగి పోలీస్ స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. యానాంలోని ఒక పెట్రోల్ బంకు నుంచి 2400 లీటర్ల డీజిల్‌ను కొనుగోలు చేసి జగ్గంపేట తరలిస్తుండగా వ్యాన్ సీజ్ చేశారు. యానాంలో లీటర్ డీజిల్ రూ.84.79కు కొనుగోలు చేసి, ఆంధ్రాలో రూ.97కు పైగా విక్రయిస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడిలో తాళ్లరేవు, కోరంగి, పటవల వీఆర్వోలు సమనాసి వీరబాబు, ఎల్.శ్రీను, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదరించే వారులేక ఆత్మహత్యాయత్నం


స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రాంబాబుకు నాగరత్నాన్ని అప్పగిస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: జీవిత చరమాంకంలో ఒంటరి జీవులకు ఆలనా పాలనా చూసేవారు లేకపోవడంతో చివరికి చావుకు దగ్గర కావాలని కోరుకుంటూ బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తుమ్మిడి నాగరత్నం (75)ను అనారోగ్యం ఒక వైపు, అయినవారు చూడకపోవడం మరోవైపు కుంగదీసింది. కుటుంబ సభ్యుల ఈసడింపులను తట్టుకోలేని ఆమె గురువారం ఉదయం రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. అక్కడ చిరు వ్యాపారులు ఆమెను నిలువరించి మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదృష్టవశాత్తు ఆమె బతికి బయటపడింది. పోలీసులు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రాంబాబుతో మాట్లాడి ఆమె దుస్థితిని వివరించి ఆశ్రమంలో చేర్పించారు. ఇక్కడ తనలాంటి పది మందిని చూసి, బతకాలని ఆశ కలిగిందని నాగరత్నం తెలిపారు.

బంధువులు వస్తే అప్పగిస్తాం

స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సుమారు 30 మందికి ఆశ్రయం కల్పిస్తుండగా, రోజూ రెండు పూటలా కలిపి 300 భోజనాలు అల్పాహారం, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు. అలాగే పుష్కరాల రేవులోనూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోజూ 500 మందికి మొబైల్ ఉచిత అన్నదాన సేవలను అందిస్తున్నామన్నారు. నాగరత్నం బంధువులు, సంబంధించిన వారు ఎవరు వచ్చినా పోలీసులు ద్వారా వారికి తిరిగి అప్పగిస్తామని అన్నారు.

వాహనం సీజ్

తుని రూరల్: మాంసపు వ్యర్థాల లోడు వాహనాన్ని ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సీజ్ చేసినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. గురువారం విశాఖపట్నం నుంచి కాకినాడ జిల్లా ఇర్రిపాకకు వెళుతున్న వ్యర్థాల లోడు వాహనాన్ని ఎఫ్‌డీఓ సీజ్ చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.


రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమ్మవారు


కాకినాడ దేవాలయం వీధిలో గాయత్రి దేవిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు


పిఠాపురం పాదగయ రాజరాజేశ్వరీదేవి అమ్మవారు


స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమలాపురం శ్రీదేవి అమ్మవారు


రాజరాజేశ్వరి అవతారంలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

అపురూపమమ్మ

- ఉమ్మడి జిల్లాలో దసరా ఉత్సవాలకు శ్రీకారం
- తొలిరోజు వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు

సిరుల తల్లీ రావమ్మా.. శుభములొసగు మాయమ్మ అంటూ ఆ దుర్గాదేవిని భక్తజనం కొలిచింది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్ర ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. తొలిరోజు అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాడవాడలా అమ్మవారి మంటపాలను ఏర్పాటు చేయగా, ప్రముఖ దేవాలయాల వద్ద ఉత్సవాలు అంబరాన్నంటాయి. రాజమహేంద్రవరం, కాకినాడ, అన్నవరం, తలుపులమ్మ లోవ, అమలాపురం తదితర చోట్ల ప్రముఖ ఆలయాలతో పాటు వివిధ ఉత్సవ మంటపాల్లో వేడుకలు జరిగాయి.


అన్నవరంలో బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ


బాలాత్రిపుర సుందరిగా లోవ తలుపులమ్మ తల్లి


బాలాత్రిపుర సుందరిగా అన్నవరం వనదుర్గమ్మ


కాకినాడ రమణయ్యపేట శ్రీదేవీలంలో అన్నపూర్ణ అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరి దేవిగా అమ్మవారు


రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో విద్యుత్ దీపాలంకరణ


అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో విశేష అలంకరణలో అన్నపూర్ణాదేవి


రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో కిక్కిరిసిన భక్తులు


కోటనందూరు మండలం కాకరాపల్లిలో కలశయాత్ర చేస్తున్న మహిళలు

ఏలూరులో వైనాట్ 2వ షోరూమ్ ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు వసంతమహల్ సెంటర్‌లో వైనాట్ 2వ షోరూమ్‌ను గురువారం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కరాటం వెంకట కృష్ణాజీ ప్రారంభించారు. వైనాట్ మేనేజింగ్ డైరెక్టర్ జుజ్జవరపు వెంకట రాయుడు మాట్లాడుతూ ఏలూరులో మరింత మంది ఖాతాదారులకు అందుబాటులో ఉండడానికి తమ 2వ షోరూమ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రారంభ సేల్ లక్కీపాట్ ద్వారా మిక్సర్ గ్రైండర్‌ను ఖాతాదారునికి కరాటం వెంకట కృష్ణాజీ అందించారు. ఎల్‌జీ బ్రాంచ్ మేనేజర్ కిషోర్, లాయిడ్ రీజినల్ మేనేజర్ హేమసుందర్, హేయర్ బ్రాంచ్ మేనేజర్ అరవింద్ శర్మ, సోనీ సీనియర్ మేనేజర్ భాస్కర్, శ్యామ్‌సంగ్ ఐఎఫ్‌బీ, బోష్, ఎంఐ, వివో కంపెనీల ఏరియా మేనేజర్లు పాల్గొన్నారు.


వైనాట్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎల్‌జీ జనరల్ మేనేజర్ కృష్ణాజీ

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మరో విద్యార్థినిని శిక్షించిన ఫిర్యాదుల మేరకు హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) మోసుగంటి వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు గదులు తుడవడానికి వస్తే చాక్లెట్లు ఇస్తానని చెప్పడంతో విద్యార్థినులు వెళ్లి తుడిచారు. అనంతరం విద్యార్థినులు సదరు మాస్టర్‌ను చాక్లెట్‌లు అడిగితే అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు మరో విద్యార్థినిని శిక్షించాడని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం డీవైఈఓ నారాయణ, జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తప్పు చేసినట్లు తేలింది. దీంతో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు అతన్ని సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావుపై ఎటువంటి పోలీసు కేసు నమోదు కాకుండా పిడింగొయ్యికి చెందిన ఓ టీడీపీ నేత మధ్యవర్తిత్వం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సఖినేటిపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కేశవదాసుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుజాత మృతి చెందారు. ఉయ్యూరువారి మెరక గ్రామంలోని వెలంకాయల కోడు కాలువగట్టు ప్రాంతంలో ఆమె నివాసం ఉంటున్నారు. మంగళవారం స్కూల్‌కు వెళ్లే క్రమంలో కేశవదాసుపాలెం వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

కాకినాడ సిటీ: జిల్లాలో ఖరీఫ్ 2024 ధాన్యం సేకరణకు యంత్రాంగం సిద్ధం కావాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి ధాన్యం కొనుగోలు సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ లోపు గోనె సంచులను మిల్లర్ల వద్ద నుంచి రైతు సేవా కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

చాకులతో నలుగురిపై దాడి

- ఒకరి పరిస్థితి విషమం
- నిడదవోలు శివారు లింగంపల్లిలో ఘటన


నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కాకర్ల శ్రీను

నిడదవోలు రూరల్/ నిడదవోలు: బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి దారి ఇవ్వలేదన్న కోపంతో చాకులతో నలుగురిపై దాడికి పాల్పడిన ఘటన నిడదవోలు పట్టణ శివారు లింగంపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని లింగంపల్లిలో అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ భవానీ మాల ధరించిన భక్తులు భజనలు, చిన్నారులు కోలాటం చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన గుంటు సునీల్ బైక్‌పై ఇంటికి వెళ్లేందుకు అటువైపు వచ్చాడు. తన బైక్ వెళ్లేందుకు దారి ఇవ్వాలని సునీల్ కమిటీ సభ్యులను అడిగే సమయంలో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. దీంతో సునీల్‌తో పాటు అతని తమ్ముడు అనిల్ కలసి చాకులతో వచ్చి కమిటీ సభ్యుడైన కాకర్ల శ్రీను, అతని కుటుంబ సభ్యులు కాకర్ల పుట్టయ్య, కాకర్ల ప్రవీణ్, మీసాల శ్రీనులపై దాడి చేశాడు. దీంతో మెడ వద్ద తీవ్ర గాయాలైన కాకర్ల శ్రీనును రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి అత్యవసర వైద్య సేవల నిమిత్తం తరలించారు. గాయాలైన ప్రవీణ్, పుట్టయ్య, మీసాల శ్రీనులకు నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్సై టి.శోభన్‌కుమార్‌లు పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరంపై దాడి

కాకినాడ క్రైం: నగరంలోని రామారావు పేటలో పేకాట శిబిరంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్ట్ చేశారు. ఇందులో ప్రముఖులు ఉన్నట్లు సమాచారం. ఎస్పీ విక్రాంత్ ఆదేశాల మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రముఖ న్యాయవాదితో సహా టీడీపీకి చెందిన పలువురు చోటా నేతలు దాడుల్లో పట్టుబడినట్లు తెలుస్తోంది. 15 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.20 లక్షల మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతుడు బ్యాంక్ మేనేజర్‌గా గుర్తింపు

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట వైద్యనగర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుడు రాయుడుపాలెం యూనియన్ బ్యాంక్ మేనేజరు రొయ్యి రాంబాబు (36)గా సర్పవరం పోలీసులు గుర్తించారు. వైద్యనగర్‌లో నివసిస్తున్న రాంబాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలు స్నాక్స్ కావాలని అడగడంతో ఇంటి నుంచి రమణయ్యపేట మార్కెట్ వద్దకు బుధవారం రాత్రి వెళ్లి వాటిని కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా ఆయనను ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు బలమైన గాయం తగలడం వల్ల తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.